సాక్షి కామారెడ్డి

శనివారం । 15 । జూలై । 2023



దేశానికే ఆదర్శం

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ పేర్కొన్నారు.

- 8లో ▸



అంధకారంలో పీహెచ్‌సీ

నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో అంధకారం నెలకొంది. దీంతో రాత్రి వేళలో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.1 /23.0

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎల్లారెడ్డి, బాన్సువాడ ఆర్డీవోలు బదిలీ

సాక్షి, కామారెడ్డి: ఎల్లారెడ్డి, బాన్సువాడ ఆర్డీవోలు బదిలీ అయ్యారు. ఎల్లారెడ్డిలో పనిచేస్తున్న ఎస్.శ్రీనును కల్వకుర్తికి, బాన్సువాడలో పనిచేస్తున్న రాజాగౌడ్ బోధన్‌కు బదిలీ చేశారు. వారి స్థానంలో ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. ఒకటి రెండు రోజుల్లో నూతన అధికారులు రావచ్చని తెలుస్తోంది.

ప్రతి నెలాఖరున పౌర హక్కుల దినోత్సవం



కామారెడ్డి క్రైం: ప్రతి నెలాఖరున దళితవాడల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని, దీనికి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులను ఆహ్వానించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, ఎస్సీ సంక్షేమ అధికారి వెంకన్న, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సివిల్స్ శిక్షణ దరఖాస్తు గడువు పొడిగింపు


కామారెడ్డి అర్బన్: తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువును ఈనెల 23 వరకు పొడిగించారు. ఈ విషయాన్ని మైనారిటీ సంక్షేమ జిల్లా అధికారి టి.దయానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన, బౌద్ధ, పార్శీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్నవారికి ఆగస్టు 6న కామారెడ్డిలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 040-23236112 నంబర్‌లోగానీ, కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో గానీ సంప్రదించాలని సూచించారు.

'విద్యా వ్యవస్థ నిర్వీర్యం'



కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంగా కేసీఆర్ మనవడే సౌకర్యాలు లేని ఓ ప్రభుత్వ పాఠశాలల గురించి చెప్పి కంటతడి పెట్టుకోవడం ఇందుకు నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో దాదాపు అన్ని పాఠశాలలు అధ్వానంగా ఉన్నాయన్నారు. కేరళ, తమిళనాడు, చత్తీస్‌గఢ్, బీహార్‌లాంటి రాష్ట్రాల మాదిరిగా బడ్జెట్‌లో విద్యారంగానికి 56 శాతం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో డిప్యుటేషన్ల మాయ



ఉపాధ్యాయుల సర్దుబాటులోనూ విద్యాశాఖ అక్రమాలకు తెరలేపింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్న కలెక్టర్ మౌఖిక ఆదేశాలతో మండల పరిధిలోనే సర్దుబాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే చాలామందిని ఒక మండలం నుంచి మరో మండలానికి పంపించారు. దీని వెనుక పెద్ద తతంగమే నడిచినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

- మండల పరిధిలోనే అంటూ ఉత్తర్వులు
- నిబంధనలకు విరుద్ధంగా ఇతర మండలాలకు సర్దుబాటు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో 245 మంది టీచర్లను సర్దుబాటు చేస్తూ ఈనెల 12న డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనల మేరకు పనిచేస్తున్న మండలం పరిధిలోనే డిప్యుటేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే విద్యాశాఖ అధికారులు ఈ నిబంధనను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్‌లు ఇచ్చారు.

మద్నూర్ మండలం లచ్చన్ నుంచి ఓ ఉపాధ్యాయుడిని నస్రుల్లాబాద్ మండలానికి సర్దుబాటు చేశారు. మద్నూర్ మండలం మదన్‌హిప్పర్గ నుంచి సదాశివనగర్‌కు ఓ ఉపాధ్యాయుడిని పంపించారు. జుక్కల్ మండలం నుంచి సదాశివనగర్ మండలానికి ఓ ఉపాధ్యాయుడికి డిప్యుటేషన్ ఇచ్చారు. పెద్ద కొడప్‌గల్ మండలంలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడిని బీర్కూర్ మండలానికి, సదాశివనగర్ మండలం నుంచి పిట్లంకు మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశారు. జుక్కల్ నుంచి బిచ్కుందకు, లింగంపేట మండలం నుంచి తాడ్వాయి మండలానికి, రామారెడ్డి మండలం నుంచి కామారెడ్డి పట్టణానికి, నాగిరెడ్డిపేట నుంచి ఎల్లారెడ్డి మండలానికి, భిక్కనూరు మండలం నుంచి మాచారెడ్డి మండలానికి, మాచారెడ్డి నుంచి కామారెడ్డికి, కామారెడ్డి నుంచి మాచారెడ్డికి.. చాలా మందిని మండలాలు దాటించారు. డిప్యుటేషన్ ఉత్తర్వుల్లో ఎక్కువగా ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలనుంచి మండల పరిధిలో అవసరమైన పాఠశాలకు సర్దుబాటు చేస్తున్నట్టు పేర్కొనడం గమనార్హం.

పాత కథే..

జిల్లా విద్యాశాఖపై కొన్నేళ్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయినా అధికారుల తీరు మారడం లేదు. ఎన్ని ఆరోపణలు వచ్చినా, ఎన్ని విమర్శలు వచ్చినా చెప్పేది ఒకటి చేసేది ఒకటి అన్నట్టుగా నడుస్తోంది. ఇటీవల ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అక్రమాలు జరిగిన విషయం తెలిసిందే. పాఠశాలల పర్యవేక్షణ తమ పని కాదన్నట్టుగా విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతూ ఇతర వ్యాపకాల్లో మునిగి తేలుతున్నా పట్టించుకునేవారు లేరు. తాజాగా ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. మండల పరిధిలో అవసరమైన చోటుకు డిప్యుటేషన్‌పై పంపించాల్సి ఉన్నా.. నిబంధనలను విస్మరించి వేరే మండలాలకు సర్దుబాటు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి, విద్యాశాఖను గాడిలో పెట్టాలని విద్యాభిమానులు కోరుతున్నారు.

'ఓపెన్' అక్రమాలపై కొరడా!

- తొమ్మిది మంది ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్లలో కోత
- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి

సాక్షి, కామారెడ్డి: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అక్రమాలపై ఎట్టకేలకు జిల్లా అధికారులు స్పందించారు. అక్రమాలకు బాధ్యులుగా భావిస్తున్న వారిపై చర్యలకు ఉపక్రమించారు. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లుగా పనిచేసిన తొమ్మిది మంది ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్లు కట్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.రాజు ఉత్తర్వులు జారీ చేశారు.

ఏప్రిల్ చివరి వారంలో జిల్లాలోని 11 కేంద్రాల్లో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు జరిగాయి. పరీక్షలకు దాదాపు రెండు వేల మంది హాజరయ్యారు. ఓపెన్ పరీక్షల నిర్వహణలో అక్రమాలకు అలవాటు పడిన కొందరు.. పరీక్ష రాస్తున్న వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి మాస్ కాపీయింగ్‌తో పాటు ఒకరికి బదులు మరొకరితో పరీక్షలు రాయించారు. ఈ వ్యవహారంలో రూ.2 కోట్లకు పైగా డబ్బులు వసూలు చేసి పంచుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. స్టేట్ అబ్జర్వర్ తనిఖీలో ఈ అక్రమాలు వెలుగు చూశాయి. ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తుండగా ఎనిమిది మందిని పట్టుకుని, పోలీసు కేసులు నమోదు చేశారు. అక్రమాలపై విద్యార్థి సంఘాలు ఉన్నతాధికారులకు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లుగా పనిచేసిన మర్రి శేఖర్, వి.కృష్ణారెడ్డి, కే.సురేశ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా పనిచేసిన శ్రీనివాస్‌యాదవ్, ఏ.బాబులతో పాటు ఇన్విజిలేటర్లుగా పనిచేసిన రూప్‌సింగ్, అంతయ్య, ఇస్మాయిల్, సూర్యలకు ఒక ఇంక్రిమెంట్ కట్ చేస్తూ డీఈవో రాజు ఆదేశాలు జారీ చేశారు.

బాన్సువాడ ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నాం



బాన్సువాడలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం, కలెక్టర్ పాటిల్

- జిల్లాకేంద్రంలోని ఆస్పత్రులకు దీటుగా సేవలు..
- ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రారంభంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: జిల్లా కేంద్రాలలోని ఆస్పత్రుల స్థాయిలో బాన్సువాడలో కూడా అన్ని రకాల ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి తెస్తున్నామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రూ.3 కోట్లతో నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని శుక్రవారం ఆయన కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. రూ.1.50 కోట్లతో ఏర్పాటు చేసిన 10 పడకల డయాలసిస్ యూనిట్, రూ.27 లక్షలతో నిర్మించిన స్పెషల్ న్యూబార్న్ బేబీ కేర్ యూనిట్, రూ. 5 లక్షలతో నిర్మించిన రోగుల సహాయకుల షెడ్, డీఈఐసీ వార్డుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ బాన్సువాడ ఏరియా ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని కలుపుతూ రోగులు, వైద్యులు, సిబ్బంది ప్రధాన రహదారిని దాటడానికి వీలుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించామన్నారు. ఏరియా ఆస్పత్రిలో ఇప్పటికే 5 డయాలసిస్ బెడ్స్ ఉన్నాయని, అదనంగా మరో ఐదు యూనిట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నెలలు నిండకముందే పుట్టే పిల్లలకు అవసరమైన చికిత్స కోసం నవజాత శిశువుల వార్డును ఏర్పాటు చేశామన్నారు. మానసికంగా, శారీరకంగా సరిగ్గా ఎదుగుదల లేని పిల్లలకు వైద్యం అందించడానికి డీఈఐసీ వార్డును అందుబాటులోకి తెచ్చామన్నారు. గర్భంలో ఉన్న శిశువు ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి టిఫా స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేయించామన్నారు. ఏరియా ఆస్పత్రికి కొత్త భవనం కోసం రూ. 37.50 కోట్లు మంజురయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్, ఎంపీపీ నీ రజా వెంకట్‌రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మ గోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, పాత బాలకృష్ణ, మోహన్‌నాయక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీకి ఉత్తమ సేవా పథకం

- మరో ఐదుగురికీ అవార్డులు..



ఏఎస్పీ అన్యోన్య



ఉస్మాన్



శ్రీనివాస్



లక్ష్మీనర్సింలు

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో పనిచేస్తున్న అధికారులకు 2023 సంవత్సరానికిగాను ఉత్తమ సేవా పథకాలను ప్రకటించింది. జిల్లాకు చెందిన ఆరుగురికి అవార్డులు దక్కాయి. అదనపు ఎస్పీ అన్యోన్య ఉత్తమ సేవా పథకం, క్రైం బ్రాంచ్ ఎస్సై ఉస్మాన్, తాడ్వాయి ఏఎస్సై శ్రీనివాస్, లింగంపేట ఏఎస్సై ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనర్సింలు, బీబీపేట హెడ్ కానిస్టేబుల్ రాజయ్యలకు సేవా పథకాలు లభించాయి. అవార్డులకు ఎంపికైన అధికారులను ఎస్పీ శ్రీనివాసరెడ్డి అభినందించారు.

'రక్తహీనతపై అవగాహన కల్పించాలి'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కామారెడ్డి క్రైం: బాలికలలో రక్తహీనత తలెత్తకుండా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం యూనిసెఫ్ ఆధ్వర్యంలో రక్తహీనత, బాల్య వివాహాల నిర్మూలనపై శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రక్తహీనత వల్ల రోగనిరోధక శక్తి తగ్గి వ్యాధుల బారిన పడే అవకాశాలు పెరుగుతాయన్నారు. రక్తహీనత లక్షణాలున్న బాలికలను గుర్తించి సమీపంలోని పీహెచ్‌సీల్లో రక్త పరీక్షలు చేయించాలన్నారు. రక్తహీనతకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఐకేపీ అధికారులు మహిళా సంఘాల సభ్యులకు, ఉపాధ్యాయులు విద్యార్థినులకు వివరించాలన్నారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేస్తే కలిగే నష్టాలను వారి తల్లిదండ్రులకు వివరించి, బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, సీడబ్ల్యూసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, యూనిసెఫ్ అధికారులు సుబ్బారెడ్డి, కృష్ణ, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ రమ్య, డీపీఎం రమేష్ బాబు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్ బదిలీ



ఎం. మను చౌదరి

సాక్షి, కామారెడ్డి: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే బదిలీ అయ్యారు. ఆయనను మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్‌లో అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.మను చౌదరికి పోస్టింగ్ ఇచ్చారు. ఇద్దరు కూడా 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారే. ధోత్రే కామారెడ్డిలోనే ట్రైనీ కలెక్టర్‌గా చేరారు. తర్వాత స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేయడంలో భాగంగా ప్రతి జిల్లాకు అదనపు కలెక్టర్లుగా ఐఏఎస్‌లను నియమించగా.. ధోత్రేకు ఇక్కడే పోస్టింగ్ ఇచ్చారు. నాలుగేళ్ల పాటు జిల్లాలో సేవలందించారు.

పకడ్బందీగా ఓటరు జాబితా తయారుచేయాలి

- పోలింగ్‌కేంద్రాలను సిద్ధం చేయండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ పాటిల్, అధికారులు

కామారెడ్డి క్రైం: డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి సాధారణ ఎన్నికలపై అవగాహన, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఉపయోగంపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఒక ఇంట్లో ఆరుగురికంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వారి వివరాలను ధ్రువీకరించాలని సూచించారు. జాబితా నుంచి పెద్ద ఎత్తున ఓటర్ల వివరాలను తొలగిస్తే అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల ఏర్పాటు, లైటింగ్, తాగునీరు, అవసరమైన ఫర్నిచర్, పురుషులకు, స్త్రీలకు ప్రత్యేకంగా టాయిలెట్లు, ఇతర సదుపాయాలు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. జూలై 28 నుంచి స్వీప్ కార్యక్రమాలు విస్తృతం చేయాలని, దీనిపై రాజకీయ పార్టీలకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పించాలి

ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై ఓటర్లకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా వాహనాలను ఏర్పాటు చేసి ప్రతి గ్రామం, ఆవాస వారీగా పర్యటించి ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 20 నుంచి అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలని, సెప్టెంబర్ నాటికి జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా పురుషులు, మహిళల ఓటర్ల వివరాలు, వయస్సు, జనాభా నిష్పత్తి వివరాలు, లింగ నిష్పత్తి నివేదికలు తయారు చేయాలన్నారు. మండలాల వారీగా సమాచారం సేకరించి నివేదికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రెడ్డి, శీను, రాజాగౌడ్ పాల్గొన్నారు.

పోలీసు బదిలీలకు కసరత్తు

- సొంత జిల్లా నిబంధనతో పలువురికి తప్పని ట్రాన్స్‌ఫర్
- జాబితాలో 20 మంది ఎస్సైలు..

సాక్షి, కామారెడ్డి: పోలీసు శాఖలో బదిలీలకు కసరత్తు జరుగుతోంది. ఒకే సబ్ డివిజన్‌లో మూడేళ్లుగా పనిచేస్తున్న వారితో పాటు సొంత జిల్లాలో పనిచేస్తున్న ఎస్సైలు, ఆపై అధికారుల బదిలీలు చేపట్టేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని స్టేషన్లలో పనిచేస్తున్న ఐదుగురు ఎస్సైలతో పాటు ప్రమోషన్లు పొంది వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మరో 15 మంది ఎస్సైలకు స్థాన చలనం తప్పేట్టు లేదు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వచ్చి రెండేళ్లు కాలేదు. దీంతో ఆయన కొనసాగే అవకాశాలున్నాయి. అదనపు ఎస్పీ అన్యోన్య ఇటీవల పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన రిలీవ్ కావాల్సి ఉంది. ఎల్లారెడ్డి డీఎస్పీ బదిలీపై వెళ్తున్నారు. ఇటీవలే వచ్చిన కామారెడ్డి, బాన్సువాడ డీఎస్పీలకు బదిలీనుంచి మినహాయింపు ఉండనుంది. జిల్లాలో పనిచేస్తున్న సీఐలు దాదాపు అందరూ ఇతర జిల్లాలకు చెందిన వారే.. వారు వచ్చి మూడేళ్లు దాటకపోవడంతో బదిలీలు ఉండకపోవచ్చు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు



స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం జరుగుతున్న ఎంపిక పోటీలు

కామారెడ్డి అర్బన్: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగు, ఐదు తరగతులలో ప్రవేశాల కోసం శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ చూపినవారిని రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తామని జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి తెలిపారు. హకీంపేటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపే వారికి ర్యాంకుల ఆధారంగా హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో పీఈటీలు అనిల్‌కుమార్, వెంకటేశ్వర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి మొక్కను సంరక్షించాలి'



మొక్కకు నీరు పోస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: పర్యావరణ పరిరక్షణ కోసం నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం హరితహారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఏఎస్పీ అన్యోన్య, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 17న జరగాల్సిన డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్, 1వ, 3వ, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను బోనాల పండుగ కారణంగా వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను తిరిగి 18న నిర్వహిస్తామని తెలిపారు.

ఐదో సెమిస్టర్ పరీక్ష ప్రశాంతం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఐదో సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షలో ఆరుగురు విద్యార్థులకు అందరూ హాజరైనట్లు కంట్రోల్ తెలిపారు.

ప్రాక్టికల్ పరీక్ష తేదీల్లో మార్పు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్ ప్రాక్టికల్ పరీక్షల తేదీల్లో మార్పు చేసినట్లు కంట్రోలర్ తెలిపారు. సెట్–1 గ్రూప్–ఏ సంబంధిత కళాశాలల్లో ఈ నెల 19 నుంచి 24 వరకు, గ్రూప్–బీ కళాశాలల్లో ఈ నెల 27 నుంచి ఆగస్ట్ 2వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. అలాగే సెట్– 2 లో స్టాటిస్టిక్స్ ప్రాక్టికల్ /ప్రాజెక్టు పరీక్షలు గ్రూప్– ఏ సంబంధిత కళాశాలల్లో జూలై 25, 26వ తేదీల్లో, గ్రూప్–బీ సంబంధించిన కళాశాలల్లో ఆగస్ట్ 3, 4వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ తెలిపారు.

చలో బీసీ రాజకీయ ప్లీనరీకి తరలి రావాలి



భిక్కనూరు: బీసీలకు జనాభా ప్రాతిపాదికన చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించేలా చూడాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాజకీయ ప్లీనరీకి సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం భిక్కనూరులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, ఉపాధ్యక్షుడు మారోజు మోహనాచారి, ప్రతినిధులు నాగోజి నారాయణ రావు, మండల అధ్యక్షుడు పనస నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల కోసం విజ్ఞాపన ర్యాలీ



బీబీపేట: బీబీపేట మండల కేంద్రానికి జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం జూనియర్ కళాశాల సాధన సమితి సభ్యులు మాందాపూర్‌లో విద్యార్థులతో విజ్ఞాపన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్‌రెడ్డిలు హామీ ఇచ్చారని, ఇప్పటికీ ఏర్పాటు చేయలేదని వారు గుర్తు చేశారు.

అంధకారంలో పీహెచ్‌సీ

- మూడు రోజులుగా నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో వెలగని బల్బులు
- గోడలు, నల్లాలకు కరెంట్ సరఫరా అవుతున్న వైనం
- రాత్రివేళ పాములు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్న సిబ్బంది



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం(పీహెచ్‌సీ)లో మూడు రోజులుగా కరెంట్ సరఫరాలో తలెత్తిన అంతరాయం వల్ల అంధకారం నెలకొంది. పీహెచ్‌సీ భవనంలో వైరింగ్ చెడిపోవడం వల్ల కరెంట్ సరఫరాకు అంతరాయం తలెత్తింది. పలుమార్లు విద్యుత్ అధికారులు సందర్శించి సమస్యను గుర్తించినా దాని పరిష్కారం కావడంలేదు. పీహెచ్‌సీ భవనంలో సమస్య తలెత్తిన ప్రతిసారీ స్థానికంగా ఉండే ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌లను పిలిపించి తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తున్నారు కానీ శాశ్వతంగా పరిష్కరించలేకపోతున్నారు. ఫలితంగా రెండేళ్లుగా అప్పడప్పుడూ నాలుగైదు రోజులపాటు పీహెచ్‌సీ భవనం అంధకారంలోనే ఉండిపోతుంది.

రెండు దశాబ్దాల క్రితం భవన నిర్మాణం..

నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో 29 జనవరి, 1999లో పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణ సమయంలో కరెంట్ సరఫరా కోసం స్లాబ్‌తో పాటు గోడలలో ఐరన్ పైపులను ఏర్పాటు చేశారు. భవన నిర్మాణం జరిగి 20 ఏళ్లకు పైగా పూర్తయిన నేపథ్యంలో స్లాబ్, గోడలలో వేసిన ఐరన్ పైపులు తుప్పుపట్టి ప్రస్తుతం కరెంట్ సరఫరాకు తీవ్రఅంతరాయం కలుగుతుంది. బాత్ రూముల్లోని నల్లాలకు కూడా అప్పుడప్పుడూ కరెంట్ సరఫరా అవుతుంది. పీహెచ్‌సీకి వచ్చే రోగులలో కొంతమంది కరెంట్ షాక్‌కు సైతం గురైన ఘటనలు ఉన్నాయి.

వ్యాక్సిన్ నిల్వకు తిప్పలు..

వ్యాక్సిన్‌లను పీహెచ్‌సీ భవనంలో నిల్వ చేసేందుకు సిబ్బంది తిప్పలు పడుతున్నారు. పీహెచ్‌సీ భవనం మొత్తంలో కేవలం రెండు గదులలో మాత్రమే కరెంట్ వస్తోంది. వ్యాక్సిన్ నిల్వచేసే గదిలో సైతం కరెంట్ సరఫరా కాకపోవడంతో సిబ్బంది వ్యాక్సిన్ నిల్వ చేసే రిఫ్రిజిరేటర్లను మరో గదిలోకి మార్చారు. పీహెచ్‌సీ భవనం ఆవరణలో గడ్డి, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలలో నుంచి తరుచూ పాములు వస్తున్నాయని, రాత్రివేళ విధులు నిర్వహించడమంటే కత్తిమీద సాములా మారిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పీహెచ్‌సీ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు

పీహెచ్‌సీలో పాము కలకలం!



నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి గురువారం రాత్రి ఓ విషపాము చొరబడింది. రాత్రి వేళ పీహెచ్‌సీలో కరెంట్ లేకపోవడంతో పాము లోనికి వచ్చిందని సిబ్బంది తెలిపారు. ప్రధాన ద్వారం ద్వారా లోపలికి వచ్చిన పామును గుర్తించిన సిబ్బంది కర్రతో కొట్టి చంపేశారు.

నాకు కరెంట్‌షాక్ వచ్చింది



నేను పది రోజులకు ఒకసారి పీహెచ్‌సీకి వచ్చి వైద్యం చేయించుకుంటుంటాను. ఇటీవల పీహెచ్‌సీకి వచ్చినప్పుడు మందులు తీసుకునే గది వద్దనున్న తలుపు దగ్గర కరెంట్ షాక్ వచ్చింది. వెంటనే నేను దూరంగా జరిగి మందులు తీసుకున్నాను. పీహెచ్‌సీలో వైరింగ్ చెడిపోయి అప్పుడప్పుడూ కరెంట్‌షాక్ వస్తుందని సిబ్బంది చెప్పారు. – మన్నె మంజుల, వాడి

నల్లాలకూ షాక్ వస్తోంది



ఇదివరకు పీహెచ్‌సీకి వచ్చినప్పుడు గోడలకు ఎర్త్ మాదిరిగా స్వల్పంగా కరెంట్ షాక్ వచ్చింది. గోడలకు కరెంట్‌షాక్ వస్తుందని సిబ్బందికి చెబితే వైరింగ్ ప్రాబ్లం ఉందని సిబ్బంది చెప్పారు. బాత్ రూంల్లోని నల్లాలకు సైతం కరెంట్ సరఫరా అవుతుంది. అధికారులు స్పందించి పీహెచ్‌సీలో వైరింగ్‌ను బాగు చేయించాలి. – మ్యాదరి నారాయణ, నాగిరెడ్డిపేట

రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించారు

బాన్సువాడ: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి అమెరికాలో ఉచిత విద్యుత్‌పై అన్న మాటలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించి రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంటు ఇస్తే వాటి వివరాలు రైతుల వద్ద ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కొనుగోలులో భారీ కుంభకోణం ఉన్నట్లు రేవంత్ రెడ్డి దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేశారని అన్నారు. నాయకులు ఖలీక్, మంత్రి గణేష్, మాసాని శేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత కాసుల బాల్‌రాజ్

కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నాకు తరలిరావాలి

భిక్కనూరు: కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న మహాధర్నాకు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు చెందిన కాంట్రాక్టు అధ్యాపకులు తరలిరావాలని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణ గుప్తా కోరారు. శుక్రవారం సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు నిర్వహించిన ప్లకార్డుల ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. 12 విశ్వవిద్యాలయాల్లో 1,336 మంది కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నారని, వారిందరని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులు డాక్టర్ యాలాద్రి, డాక్టర్ నరసయ్య, రమాదేవి, సునీత, వైశాలి, తదితరులు పాల్గొన్నారు.



సౌత్‌క్యాంపస్‌లో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): మండల శివారులో క్షేత్ర స్థాయిలో ఏవో నరేష్‌తో కలిసి పంటలను ఎల్లారెడ్డి ఏడీఏ రత్న పరిశీలించారు. మొక్క జొన్నలో భాస్వరం లోపించడంతో పాటు కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. భాస్వర లోపం నివారణకు రైతులు ఎన్‌పీకే పోషకాలున్న 28:28:0 లేదా 19:19:19 ఎకరానికి కిలో చొప్పున పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కాండం తొలిచే పురుగు నివారణకు హెమామెక్టిన్ బెంజాయిట్ 5 శాతం మందును పిచికారీ చేయాలని సూచించారు

18 లోపు ఎంఈడీ ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ 1వ, 3వ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ, ప్రాక్టికల్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజును ఈ నెల 18వ తేదీలోపు చెల్లించాలని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 20వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నాయి
- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీ



పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాజాల

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మర్కల్ గ్రామ స్టేజీ వద్ద గల అశోక్ గార్డెన్స్‌లో 475 మంది గిరిజనులకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు తమ రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుద్రోవ పట్టిస్తున్నారన్నారు. రాష్ట్రానికి కేంద్రం చేసిందేమీ లేదన్నారు. కొన్ని సంవత్సరాలుగా పోడు సమస్య ఉండడంతో గిరిజనులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చిందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రస్తుతం గిరిజనుల భూములకు పట్టాలు ఇవ్వడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు 3 గంటల కరెంట్ సరిపోతది అని పలకడం సిగ్గు చేటన్నారు. ఢిల్లీ నుంచి బీజేపీ నాయకులు వచ్చి గల్లీలో ముచ్చట చెబితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ సందర్భంగా 44 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పట్టు చీరతో పాటు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గైని అనసూయ, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ ధన్వాల్, ఎంపీడీవో లక్ష్మి, కుర్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్కంటి బుచ్చన్న, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ నాయక్, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, ఎంపీటీసీ బీరయ్య, సర్పంచ్‌లు బద్దం శ్రీనివాస్ రెడ్డి, సంగారెడ్డి, నర్సయ్య, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ఉమాదేవి

భిక్కనూరు: ధ్యానంతోనే మానసిక ప్రశాంతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కామారెడ్డి పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ సీనియర్ మాస్టర్ ఉమాదేవి అన్నారు. శుక్రవారం ఆమె మాస్టర్ జ్ఞానేశ్వర్‌తో కలిసి భిక్కనూరు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు బస్వాపూర్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజూ రెండు పూటల ధ్యానం చేస్తే వారి ఆరోగ్యంతో పాటు మంచి ఆలోచనలు వస్తాయన్నారు. ఎంత వయస్సు ఉంటే అన్ని నిమిషాల పాటు ధ్యానం చేయాలన్నారు. తమ సంస్థ ద్వారా ఉచితంగా ధ్యాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు తిప్పితే చర్యలు
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్: అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోతంగల్ మండలం బాకర్‌ఫారం, కారేగాం గ్రామాల్లో శుక్రవారం రాత్రి స్పీకర్ పర్యటించి పనులను పరిశీలించారు. కారేగాంలో రూ.10లక్షలతో నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న బీటీ రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు తీసుకు రావొద్దన్నారు. రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు తిప్పె వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ శంకర్ పటేల్, పోచారం సురేందర్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బాకర్ ఫారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం

ఠాణాను తనిఖీ చేసిన ఏసీపీ

ధర్పల్లి: ధర్పల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. రిసెప్షన్, రికార్డులను తనిఖీ చేసి స్టేషన్ పరిధిలోని నమోదైన కేసుల వివరాల గురించి ఆరా తీశారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన పలు సూచనలను చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పాత నేరస్తులపై నిఘా పెట్టాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. సీఐ సైదా, ఎస్సై వంశీకృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.



ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

రెంజల్: రెంజల్ ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన సదరు విద్యార్థినులు మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. రోజూ ఇంటి నుంచి పాఠశాలకు వస్తుంటారు. శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి వెళ్లిన వారు ఇంటికి వెళ్లలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పాఠశాలలో ఆరా తీశారు. అక్కడ ఆచుకీ దొరకక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థినుల కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు.

దోస్త్ స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ ప్రవేశాల కోసం 'దోస్త్ –2023' లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీ (దివ్యాంగులు, క్యాప్, ఎన్‌సీసీ, ఇతర విభాగాల) అభ్యర్థుల సర్టిఫికెట్ లను శుక్రవారం పరిశీలించారు. వర్సిటీ పరిపాలనా భవనంలోని అకడమిక్ ఆడిట్ సెల్ విభాగంలో అభ్యర్థుల సర్టిఫికెట్లను దోస్త్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ పరిశీలించారు. ఎన్‌సీసీకి సంబంధించి ఏడుగురు, దివ్యాంగులకు సంబంధించి ఒకరు హాజరైనట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని గొల్లవాడ వద్ద కరెంట్ షాక్‌తో శుక్రవారం గేదె మృతి చెందింది. రైతు ముదాం సాయిలు గేదె మేతకు వెళ్లి మృతి చెందడంతో పరిహారం ఇప్పించాలని బాధితుడు కోరారు.

క్రైం కార్నర్

డ్రెయినేజీలో పడి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంగళరావు కాలనీలో షేక్ అహ్మద్ (47) మురికి కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపారు. షేక్ అహ్మద్ ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. గురువారం రాత్రి పనులు ముగించుకొని వెళ్తుండగా ఇంటి ముందు ఉన్న డ్రెయినేజీలో కాలు జారి పడి చనిపోయాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు అమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

అశోక్‌సాగర్‌లో పడి మహిళ..

ఎడపల్లి: మండలంలోని అశోక్‌సాగర్‌లో పడి బోధన్ మండలంలోని చెక్కి క్యాంపుకు చెందిన పన్నెలి భారతి (55) మృతి చెందినట్లు ఎస్సై పాండేరావు తెలిపారు. భారతికి మతిస్థిమితం లేక పోవడంతో ఈనెల 8న ఇంటి నుంచి వెళ్లినట్లు చెప్పారు. మృతురాలి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇద్దరి బైండోవర్

లింగంపేట: మండలంలోని ఒంటర్‌పల్లి తండాకు చెందిన ఇద్దరిని శుక్రవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. గతంలో గంజాయి కేసుతో సంబంధం ఉన్న బానోత్ కిషన్, బానోత్ భీమాను తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

బిచ్కుంద: మండలంలోని ఫత్లాపూర్‌లో శుక్రవారం ఓ ఉపాధ్యాయుడికి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. విద్యార్థి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిని నిలదీసి దేహశుద్ధి చేశారు.

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య



సాయిలు(ఫైల్)

లింగంపేట: మండలంలోని ఎక్కపల్లి గ్రామానికి చెందిన ఈరన్న సాయిలు(26) గురు వారం గ్రామ శివారులోని పటేల్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సాయి లుకు తన సోదరుడితో ఆస్తి తగదాలు ఉన్నాయి. సాయిలు, అతని భార్య లావణ్య ఈ నెల 12న పర్మళ్లలో బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ భార్యాభర్తల మధ్య పొలానికి సంబంధించిన పట్టా పాసుపుస్తకం విషయంలో గొడవ జరిగింది. ఈ విషయంలో తన బావమరిది రాజేష్, వదిన కిష్టవ్వ, నక్క సాయిలు, భార్య లావణ్య సాయిలును కొట్టి బైకు లాక్కొని పంపించారు. అదే రోజు సాయిలు తన స్వగ్రామానికి వచ్చాడు. గురువారం కుల పెద్దలు ఎల్లన్న, ఎల్లయ్యలకు తన బాధ చెప్పారు. సాయంత్రం గ్రామ శివారులోని పటేల్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇస్లాంపుర కాలనీలో చోరీ

- 30 తులాల బంగారం, రూ.10 లక్షల నగదు దొంగతనం



ఘటనపై ఆరా తీస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఘన్‌పూర్ గ్రామపంచాయతీ ఇస్లాంపురా కాలనీలో గురువారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్లాంపుర కాలనీలో నివాసముంటున్న అమ్జాద్‌హుస్సేన్, అతడి భార్య గరీబున్నిసాబేగం నెల రోజులు క్రితం కరీంనగర్‌లో బంధువుల ఇంటికి వెళ్లారు. గరీబున్నిసాబేగం తల్లి ఆరోగ్యం బాగా లేకపోవడంతో అక్కడే ఉండిపోయారు. వారి కుమారుడు అర్షద్, కూతురు అర్షిన్ ఫాతిమా మూడు రోజుల క్రితం కామారెడ్డికి వెళ్లి గురువారం సాయంత్రం ఇంటికి వచ్చారు. రాత్రికి ఇంటికి తాళం వేసి అదే కాలనీలోని బావ ఇంట్లో పడుకున్నారు. అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బీరువా, అల్మారాలను ధ్వంసం చేసి 30 తులాల బంగారం, 35 తులాల వెండి అభరణాలతో పాటు బీరువాలోని రూ.10లక్షల నగదును ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయాన్నే ఇంటికి వచ్చిన అర్షద్, అర్షిన్ ఫాతిమా తాళం పగులగొట్టి ఉండటం చూసి లోనికి వెళ్లి చూడగా బీరువా, అల్మారాలు తెరిచి ఉండటంతో చోరీ జరిగిన విషయాన్ని కరీంనగర్లో ఉన్న తల్లిదండ్రులకు, డిచ్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఎస్సై గణేష్ లు బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్‌కు ఘటనా స్థలాన్ని సందర్శించారు. కరీంనగర్ లో ఉన్న బాధితులు అమ్జాద్, గరీబున్నీసాబేగం ఇంటికి చేరుకుని డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

3 నెలల క్రితమే సౌదీ నుంచి..

బతుకుదెరువు కోసం సౌదీ వెళ్లిన అమ్జాద్ మూడు నెలల క్రితమే ఇంటికి వచ్చారు. ఘన్‌పూర్ ఇస్లాంపురా కాలనీలో భార్యా పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నారు. సొంత ఇల్లు కొనుగోలు చేయాలని రూ.10లక్షలు తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. ఇల్లు కొందామనుకునే లోగానే దొంగలు నగలు, డబ్బులు ఎత్తుకెళ్లడంతో బాధితులు విలపిస్తున్నారు.

హై వోల్టేజీతో కాలిపోయిన టీవీలు

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో హై వోల్టేజ్, లోవోల్టేజీ విద్యుత్తు సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం ఉదయం గ్రామంలో హైవోల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు పేలి పోయాయి. గత కొంత కాలంగా గ్రామంలోని విద్యుత్ సమస్యపై ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.

చైన్ స్నాచర్ అరెస్టు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి హౌసింగ్‌బోర్డు కాలనీలో ఓ మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కొని పారిపోయిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు శుక్రవారం రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13న రాత్రి 8.30 గంటల ప్రాంతంలో హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన పోల లక్ష్మి మెడలో నుంచి మూడున్నర తులాల పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. దీనిపై బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మాక్లూర్ మండలానికి చెందిన ప్రభునాథ్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. అతడి నుంచి పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. 24 గంటల్లోపే నిందితుడిని పట్టుకున్న ఎస్సై లింబాద్రి, సిబ్బందిని సీఐ అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బాన్సువాడ రూరల్: మండలంలోని బుడ్మి చౌరస్తా వద్ద శుక్రవారం పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ నుంచి మద్దెల్‌చెర్వు వైపు బొలేరో వ్యాన్ వెళ్తుండడంతో అనుమానం వచ్చి తనిఖీ చేయగా వాహనంలో 32 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉందన్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు.



చికిత్స పొందుతూ ఒకరి మృతి



గణేశ్(ఫైల్)

నాగిరెడ్డిపేట: అప్పుల బాధతో ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన శేగూరి గణేశ్‌కుమార్(29)కు భార్య మంజులతోపాటు కుమారుడు కార్తీక్, కూతురు దీక్షిత ఉన్నారు. ఏడాదిగా మంజులకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆస్పత్రుల్లో చూపెట్టాడు. ఆమె చికిత్స కోసం గణేశ్ అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు ఎలా తీర్చాలని మనోవేదనకు గురయ్యేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న పొలానికి వెళ్తున్నాని చెప్పి ఇంట్లో నుంచి బయల్దేరిన గణేశ్ పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీంతో గ్రామస్తుల సహాయంతో గణేశ్‌ను చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం అతనిని హైద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గణేశ్ శుక్రవారం తుదిశ్వాస విడిచాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఉమేష్ తెలిపారు.